సాక్షి
కామారెడ్డి

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



సింగితం రిజర్వాయర్ అలుగుపైనుంచి పారుతున్న నీరు

న్యూస్‌రీల్

ఆర్ట్స్ కళాశాలలో బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సోమవారం బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త శ్రీవల్లి మాట్లాడుతూ సహజ సిద్ధంగా లభించే కలబంద, పసుపు, తేనె, నిమ్మరసం లాంటి పదార్థాలను ఉపయోగించి అందం పెంపొందించే విధానాలను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, సమన్వయకర్తలు విశ్వప్రసాద్, జయప్రకాష్, అధ్యాపకులు దినకర్, మానస తదితరులు పాల్గొన్నారు.

'రైతులు డ్రోన్ సేవలు వినియోగించుకోవాలి'

కామారెడ్డి అర్బన్: పంటలపై పురుగు మందుల పిచికారి కోసం రైతులు డ్రోన్ సేవలు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి సూచించారు. డ్రోన్‌తో పురుగు మందుల పిచికారి ద్వారా తక్కువ వ్యయంతో ఎక్కువ లాభం కలుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు డ్రోన్‌ల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

22న కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: మెదక్ ఐటీసీ ఫుడ్ డివిజన్‌లో 20 మిషన్ ఆపరేటర్ పోస్టుల భర్తీ కోసం ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ లేదా ఇంటర్ వొకేషనల్ కోర్సు చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 29 ఏళ్లలోపువారు ఈనెల 22న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే జాబ్‌మేళాకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 87907 37320, 76719 74009 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'న్యాయవాదుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా'



కామారెడ్డి టౌన్ : న్యాయవాదుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా స్థాయి లీగల్ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్టీ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ దేవరాజ్‌గౌడ్ న్యాయవాదుల సమస్యలను అశోక్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, జుడీషియల్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ముబిన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, లీగల్ సెల్ ప్రతినిధులు ఉమాశంకర్, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంగోపాల్ రావు, నర్సింహారెడ్డి, సిద్దరాములు, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు

- పరవళ్లు తొక్కుతున్న మంజీర
- ప్రాజెక్టులకు భారీ ఇన్‌ఫ్లో.. గేట్లెత్తిన అధికారులు
- నదిలో చిక్కుకుపోయిన గొర్రెల కాపరులు.. కాపాడిన యంత్రాంగం
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంటలు



నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న జలాలు

జోరు వాన

జిల్లాతోపాటు ఎగువన జోరువాన కురిసింది. వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. మంజీర నది పరవళ్లు తొక్కుతూ వచ్చి నిజాంసాగర్ ప్రాజెక్టును నింపేసింది. దీంతో ఆదివారం అర్ధరాత్రి దాటాక ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. లక్షకుపైగా క్యూసెక్కుల నీటిని వదలడంతో మంజీర పరీవాహక ప్రాంతంలోని పంట పొలాలు నీట మునిగాయి. నదిలో చిక్కుకుపోయిన ముగ్గురు గొర్రెల కాపరులు, ఒక రైతును రెస్క్యూటీం సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంతో సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ మళ్లీ కొట్టుకుపోయింది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టులకు వరద తాకిడి భారీగా పెరిగింది. వాగులతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా, వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పిట్లంలో అత్యధికంగా 17.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నిజాంసాగర్, మహ్మద్‌నగర్, బిచ్కుంద, జుక్కల్, డోంగ్లీ, పెద్దకొడప్‌గల్, మద్నూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ, బీర్కూర్, గాంధారి, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. జిల్లాలో 35 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. 26 రోడ్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఎగువన ఉన్న సింగూరు ప్రాజెక్టు, ఘనపురం ఆనకట్టల గేట్లు ఎత్తడంతో మంజీరలోకి భారీగా నీరు వస్తోంది. పోచారం ప్రాజెక్టు నీరు కూడా కలుస్తుండడంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాజెక్టులు నిండడంతో అధికారులు గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. భారీ వర్షాలతో చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. బిచ్కుంద మండలం శెట్లూర్ సమీపంలో గొర్రెలను మేపడానికి వెళ్లిన ముగ్గురు గొర్రెల కాపరులు, పొలం దగ్గరికి వెళ్లిన ఓ రైతు మంజీర ప్రవాహంలో చిక్కుకుపోయారు. రెస్క్యూ టీం వారిని కాపాడింది. నస్రుల్లాబాద్ మండలంలో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి చనిపోయాడు. కామారెడ్డి డివిజన్‌లోని మాచారెడ్డి, పాల్వంచ దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, కామారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్, రాజంపేట తదితర మండలాల్లో మాత్రం వర్షపాతం తక్కువగా ఉంది.

జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నమోదైన వర్షపాతం.. (మి.మీటర్లలో)

ప్రాంతం	వర్షపాతం						
		సర్వాపూర్	110.3	పుల్కల్	54.0	కలెక్టరేట్	34.5
పిట్లం	175.3	మేనూర్	109.8	బిచ్కుంద	49.0	తాడ్వాయి	34.3
హసన్‌పల్లి	164.5	పెద్దకొడప్‌గల్	91.5	మాచాపూర్	45.0	ఎల్పుగొండ	33.3
మగ్దుంపూర్	159.5	డోంగ్లీ	89.3	రామారెడ్డి	44.0	లింగంపేట	33.0
నస్రుల్లాబాద్	138.3	జుక్కల్	88.0	గాంధారి	40.0	పాత రాజంపేట	32.8
బొమ్మన్‌దేవ్‌పల్లి	129.0	నాగిరెడ్డిపేట్	76.0	రాంలక్ష్మణ్‌పల్లి	39.3	లచ్చాపేట్	31.5
సోమూర్	127.5	కొల్లూర్	54.0	సదాశివనగర్	37.0	బీబీపేట్	29.5
బీర్కూర్	111.8	ఇసాయిపేట	54.0	దోమకొండ	36.0	భిక్కనూరు	26.5

నిలిచిన రాకపోకలు..


బాన్సువాడ- కామారెడ్డి రహదారిపై గాంధారి మండలం సర్వాపూర్ సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనాలను ఎల్లారెడ్డి మీదుగా మళ్లించారు. పిట్లం మండల కేంద్రం నుంచి సంగారెడ్డి జిల్లా కల్హేర్‌కు వెళ్లే రహదారిపై కాకివాగు పొంగి ప్రవహిస్తోంది. ఎల్లారెడ్డి–తిమ్మారెడ్డి మధ్య కూడా వాగు పారుతోంది. ఆయా రూట్లలోనూ రాకపోకలు నిలిచాయి. నస్రుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ ప్రాంతంలో కురిసిన వర్షాలతో వాగులు పొంగి దుర్కి–మీర్జాపూర్ తదితర రూట్లలో రాకపోకలు ఆగిపోయాయి.

మునిగిన పంటలు..

మంజీర పరవళ్లు తొక్కుతుండడంతో పరీవాహక ప్రాంతమైన నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. నిజాంసాగర్‌కు దిగువన మంజీర వెంట ఉన్న బీర్కూర్, బాన్సువాడ, బిచ్కుంద, జుక్కల్, నిజాంసాగర్, పిట్లం, మద్నూర్, డోంగ్లీ మండలాల్లోనూ పంటలను వరదలు ముంచెత్తాయి. గాంధారి మండలంలోని పలు గ్రామాల్లోనూ పంటలు నీట మునిగాయి.

36 ఏళ్ల తర్వాత..

నేడు నిజాంసాగర్ 20 గేట్లకు ట్రయల్‌రన్



నిజాంసాగర్ ప్రాజెక్టు 20 గేట్ల ప్రాంతం

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో ముప్పై ఆరేళ్ల తర్వాత నిజాంసాగర్ ప్రాజెక్టు చివరన ఉన్న 20 గేట్లను ఎత్తనున్నారు. మంగళవారం ఈ గేట్లను ఎత్తి ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ప్రాజెక్టుకు మూడు చోట్ల కలిపి 48 గేట్లున్నాయి. నిజాంసాగర్‌కు ఒకవైపు 12, మధ్యలో16, ఇంకోవైపు 20 గేట్లున్నాయి. సాధారణంగా మధ్యలో ఉన్న 16 గేట్లను, అవసరానుగుణంగా ఒకవైపు ఉన్న 12 గేట్లను ఎత్తుతుంటారు. 20 గేట్లను భారీ ఇన్‌ఫ్లో వచ్చినప్పుడు మాత్రమే ఎత్తుతారు. 1988 సంవత్సరంలో నిజాంసాగర్ ప్రాజెక్టుకు 3 లక్షల క్యూసెక్కులు, 1989 సంవత్సరంలో 4 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఆ సమయంలో ఈ 20 గేట్లను ఎత్తి నీటిని మంజీర నదిలోకి విడుదల చేశారు. ప్రస్తుతం భారీ వరద వస్తుండడంతో డ్యాం సేఫ్టీ దృష్ట్యా ఈ 20 గేట్లను ఎత్తాలని నిర్ణయించారు. ఒక్కో గేటును 5 ఫీట్ల మేర లేపి, నీటిని దిగువకు వదులుతూ ట్రయల్ రన్ నిర్వహిస్తామని నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ తెలిపారు. నిపుణుల బృందం గేట్ల పనితీరును పరిశీలిస్తుందన్నారు. నీటి విడుదల నేపథ్యంలో నది పరీవాహక ప్రాంతంలో బోర్లు, పైపులైన్లు, కరెంట్ వైర్లు కలిగి ఉన్న రైతులు వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.



చిన్న ఎక్లార శివారులో నీట మునిగిన సోయా పంట

పొంగిపొర్లుతున్న సింగితం..

మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌కు వరద పోటెత్తింది. ఎగువ నుంచి 5,500 క్యూసెక్కుల వరద వస్తుండడంతో రిజర్వాయర్ అలుగుపై నుంచి 1.5 మీటర్ ఎత్తున వరద నీరు పొంగిపొర్లుతోంది.

కల్యాణి ప్రాజెక్టు 5 గేట్ల ఎత్తివేత

ఎల్లారెడ్డి: తిమ్మారెడ్డి శివారులోని కల్యాణి ప్రాజెక్టులోకి సోమవారం 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో 5 వరద గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 409.50 అడుగులకు గాను 408.50 అడుగుల నీరు నిలువ ఉంచుతున్నామని అధికారులు తెలిపారు.



నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పోటెత్తిన వరద.. అర్ధరాత్రి గేట్ల ఎత్తివేత

నిజాంసాగర్: నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టులలోకి ఆదివారం అర్ధరాత్రి వేళ వరద పోటెత్తడంతో అధికారులు అప్రమత్తమై వెంటనే గేట్లను ఎత్తారు. దీంతో ప్రాజెక్టులు ప్రమాదకర స్థాయిల నుంచి బయటపడ్డాయి. రాత్రి 1.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 7 గేట్లను ఎత్తి 60 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదిలారు. 2022 తర్వాత ఈ స్థాయిలో ఇన్‌ఫ్లో రావడం ఇదే తొలిసారి.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

ఎగువ ప్రాంతాల్లో దంచికొడుతున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో 85 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. 15 గేట్ల ద్వారా 85 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1,402.75 అడుగుల (14.654 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

భారీ వర్షంలోనూ..

నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టులలోకి అర్ధరాత్రి వేళ భారీగా వరద నీరు రావడంతో అధికారులు ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు వెంటనే స్పందించారు. వెంటనే ఆయా ప్రాజెక్టులను సందర్శించి అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వరద గేట్లను ఎత్తడానికి అధికారులకు సహాయం చేశారు.

కౌలాస్‌లోకి 10,561క్యూసెక్కులు..



కౌలాస్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నిజాంసాగర్ : కౌలాస్ ప్రాజెక్టులోకి సోమవారం 10,561 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు ఐదు గేట్ల ద్వారా 8,895 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 457.70 మీటర్ల (1.164 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.



బీర్కూర్-కుర్ల రోడ్డుపైనుంచి ప్రవహిస్తున్న నీరు



కొట్టుకుపోయిన పిట్లం మండలంలోని కంబాపూర్ రోడ్డును పరిశీలిస్తున్న పోలీసులు



బీర్కూర్ బ్రిడ్జి వద్ద పరవళ్లు తొక్కుతున్న మంజీర నది

'నానో యూరియా ఎంతో ప్రయోజనకరం'




నానో యూరియా గురించి రైతుకు వివరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వినియోగించాలని, ఇది రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. పట్టణంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 500 మిల్లీలీటర్ల నానో యూరియా 45 కిలోల యూరియా బస్తాకు సమానమని, ధర కూడా తక్కువని పేర్కొన్నారు. రవాణా ఖర్చులు కూడా కలిసివస్తాయన్నారు. డ్రోన్ సహాయంతో సులభంగా పిచికారి చేయవచ్చన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సొసైటీల ముందు క్యూలు ఉండకుండా గ్రామాల వారీగా తేదీలను కేటాయించి యూరియా సరఫరా చేయాలన్నారు. సబ్సిడీ యూరియా పక్కదారి పట్టకుండా పరిశ్రమలు, వస్తు తయారీ ఇండస్ట్రీలలో తనిఖీలు చేయాలన్నారు. ఆయన వెంట డీఏవో మోహన్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు ఉన్నారు.

మళ్లీ కొట్టుకుపోయిన రిటెయినింగ్ వాల్

ఖాళీ అవుతున్న సింగితం నీరు!



కొట్టుకుపోయిన రిటెయినింగ్ వాల్ నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

నిజాంసాగర్: సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ మళ్లీ కొట్టుకుపోయింది. దీంతో నీరంతా వృథా అవుతోంది. గతేడాది కురిసిన భారీ వర్షాలవల్ల వరదనీరు పోటెత్తడంతో సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ (అడ్డుగోడ) కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అయితే వరద నీటిని కాపాడేందుకు తాత్కాలికంగా ఇసుక బస్తాలను అడ్డుగా వేసి మట్టి కట్టలు వేశారు. దీనికి రూ. 8.4 లక్షలు వెచ్చించారు. అయితే శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆదివారం అర్ధరాత్రి దాటాక మరోసారి రిటెయినింగ్ వాల్ కొట్టుకుపోయింది. సుమారు 14 మీటర్ల మేర అడ్డుగోడ కొట్టుకుపోవడంతో పాటు 10 మీటర్ల మేర రిటెయినింగ్ వాల్ శిథిలావస్థకు చేరుకొని కూలడానికి సిద్ధంగా ఉంది.

ముందే హెచ్చరించిన 'సాక్షి'

గతేడాది కొట్టుకుపోయిన రిటెయినింగ్ వాల్‌కు అప్పట్లో రూ. 8.4 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అనంతరం నీటిపారుదలశాఖ అధికారులు వాల్ నిర్మాణం కోసం రూ. 1.8 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ సర్కారు నిధులు మంజూరు చేయలేదు. భారీ వర్షాలు కురిస్తే మళ్లీ రిటెయినింగ్‌వాల్ కొట్టుకుపోయే అవకాశాలున్నాయని 'సాక్షి' ముందే హెచ్చరించింది. అయినా పాలకులు శ్రద్ధ వహించకపోవడంతో మరోసారి కొట్టుకుపోయింది. దీంతో నీరు వృథాగా పోతుండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సింగితంకు మరమ్మతులేవి?

సింగితంలో నీరు నిలిచేదెట్లా?

'సాక్షి'లో ఇటీవల వచ్చిన కథనాలు

క్లుప్తంగా

గణేష్ మండపాల వద్ద డీజేలను ఏర్పాటు చేయొద్దు



ఎల్లారెడ్డి: గణేష్ మండపాల వద్ద డీజేలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలను తీసుకుంటామని ఎస్సై మహేష్ హెచ్చరించారు. సోమవారం డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. గణేష్ మండపాల వద్ద డీజేలను ఏర్పాటు చేయవద్దని, పోలీసుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే వాడాలని అన్నారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

భిక్కనూరు: డ్రంకెన్ డ్రైవ్ కేసులో మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఒకరికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్టు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. తిప్పాపూర్ గ్రామానికి చెందిన యువకుడు గతంలో నాలుగుసార్లు డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికి జరిమానా చెల్లించాడు. ఆదివారం మళ్లీ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడినట్లు తెలిపారు. యువకుడిని కామారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని తెలిపారు.

బాలికలను చదువుకు దగ్గర చేయాలి

కామారెడ్డి అర్బన్: వివిధ కారణాలతో చదువుకు దూరంగా ఉన్న బాలికలకు అవగాహన కల్పించి వారిని చదువుకు దగ్గర చేయాలని తెలంగాణ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం అధిపతి బి.అంజయ్య అన్నారు. జాతీయ సోషల్ వర్క్ వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంజయ్య మాట్లాడారు. బాలికలు మంచి ఆహారం తీసుకోవడంతో పాటు శుభ్రత పాటించాలని, ఉన్నత లక్ష్యంతో చదువులో రాణించాలన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సోషల్‌వర్క్ విభాగం అధిపతి జి.శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు జి.రమేష్, పీబీ సత్యం, వసతి గృహ సంక్షేమాధికారి సంధ్యారాణి, సోషల్ వర్క్ విద్యార్థులు రత్నాకర్, నగ్మా, మౌనిక, శ్రీకాంత్, నవీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నదిలో చిక్కుకున్న గొర్రెల కాపరులు

- నలుగురు వ్యక్తులు, 657 గొర్రెలను కాపాడిన రెస్క్యూ టీం
- సహాయక చర్యలను పర్యవేక్షించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, సబ్ కలెక్టర్ కిరణ్మయి



పడవలో వెళ్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, సబ్ కలెక్టర్ కిరణ్మయి, పోలీసులు



కాపరులను రక్షించి ఒడ్డుకు చేర్చిన రెస్క్యూ టీంతో సబ్‌కలెక్టర్ కిరణ్మయి

బిచ్కుంద: నిజాంసాగర్, కౌలాస్ నాలా ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శెట్లూర్ గ్రామానికి ఆనుకొని ప్రవహిస్తున్న మంజీర నదిలో సోమవారం గుండెకల్లూర్ గ్రామానికి చెందిన ముగ్గురు గొర్రెల కాపరులు, 657 గొర్రెలు, శెట్లూర్‌కు చెందిన ఒక రైతులో చిక్కుకున్నారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలపడంతో వారు అధికారులు, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుకు సమాచారం అందించారు. దీంతో డిచ్‌పల్లినుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సహాయక బృందాలను రపించి సహాయక చర్యలు చేపట్టారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్పీ విఠల్‌రెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో గోపాల్ తదితరులు తెల్లవారుజామున 5 గంటలకు శెట్లూర్ మంజీర నది వద్దకు చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. రెస్క్యూ బృందం ఉదయం 6 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు సహాయక చర్యలు చేపట్టి 657 జీవాలను, నలుగురు వ్యక్తులను సురక్షితంగా కాపాడారు. సాయిగొండ, యాదుగొండ, సాయిగొండ, రైతు చాకలి సాయిలులను బోట్‌లో ఎక్కించుకొని ఒడ్డుకు చేర్చారు. రెండు బోట్ల సహాయంతో ఒక్కో బోటులో 25 నుంచి 30 గొర్రెల చొప్పున తీసుకువచ్చారు.

అధికారులను అభినందించిన ఎమ్మెల్యే

కాపరులు, గొర్రెలు చిక్కుకున్న ప్రదేశానికి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు బోట్‌లో వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్పీ విఠల్‌రెడ్డితోపాటు ఇతర అధికారులు, రెస్క్యూ టీంను అభినందించారు. పశువైద్యులను పిలిపించి, గొర్రెలకు వైద్య పరీక్షలు చేయించారు. సహాయక చర్యలలో సహకారం అందించిన యువకులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతి అందించారు.



చిక్కుకున్న గొర్రెలను రక్షించి ఒడ్డుకు తీసుకొస్తున్న రెస్క్యూటీం, గ్రామస్తులు

ఏ వాహనానికి ఏ నెంబర్ ప్లేట్

మీకు తెలుసా?



ప్రతి వాహనానికి నెంబర్ ప్లేట్ ఉంటుంది. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాన్ని తిప్పుతూ పోలీసులకు పట్టుబడితే జరిమానా వేస్తారు. వాహనాలకు వివిధ రంగుల్లో నెంబర్ ప్లేట్లు కనిపిస్తాయి. అసలు ఏ రంగు నెంబర్ ప్లేట్ ఏ వాహనాలకు కేటాయిస్తారో తెలుసుకుందాం.

తెలుపు రంగు: ఈ నంబర్ ప్లేట్ వ్యక్తిగత వాహనాలకు ఇస్తారు. ఈ ప్లేటు కలిగిన వాహనాలను కమర్షియల్‌గా ఉపయోగించరాదు.

పసుపు రంగు : ట్యాక్సీలు, ఆటోలు వంటి ప్రయాణికులను తరలించే వాహనాలకు ఈ నంబర్ ప్లేట్‌ను వాడతారు.

ఆకుపచ్చ : ఎలక్ట్రిక్ వాహనాలకు ఈ రంగు ఉన్న నంబరు ప్లేట్లను ఏర్పాటు చేస్తారు.

ఎరుపు : ఈ రంగు నంబర్ ప్లేట్లు రాష్ట్రపతి, గవర్నర్ వాహనాలకు మాత్రమే కనిపిస్తాయి. మధ్యలో జాతీయచిహ్నం ఉంటుంది.

నలుపు : విలాసవంతమైన హోటళ్లలకు చెందిన వారి వాహనాలకు ఉపయోగిస్తారు.

నీలం రంగు : విదేశీ దౌత్యవేత్తలు ఉపయోగించే వాహనాలకు ఈ రంగు నంబర్ ప్లేట్‌లు ఉంటాయి.

బాణం గుర్తు : ఈ నెంబర్ ప్లేట్‌లు సైనిక అవసరాలకు ఉపయోగిస్తారు. ఇవి రక్షణ శాఖకు రిజిస్ట్రేషన్ అయి ఉంటాయి. ఈ నంబర్ ప్లేట్‌లలో ఫస్ట్ లేదా రెండో అక్షరం తర్వాత బాణం గుర్తు ఉంటుంది. బాణం గుర్తు అనంతరం వచ్చే సంఖ్య వాహనం కొనుగోలు చేసిన సంవత్సరాన్ని గుర్తు చేస్తుంది. తర్వాత బేస్ కోడ్, సీరియల్ నంబరు, చివరిది వెహికల్ క్లాస్‌ను వివరిస్తుంది.

భారతదేశం సిరీస్ : నెంబర్ ప్లేట్‌పై బీహెచ్ అని ఉంటే ఆ వాహనం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించినదిగా గుర్తించవచ్చు. నాలుగు అంతకంటే ఎక్కువ రాష్ట్రాల్లో తమ సీఎంసీలో ఉన్న కార్పొరేట్ ఉద్యోగులు ఈ నెంబర్ ప్లేట్‌కు దరఖాస్తు చేసుకోవాలి.

నంబర్ ప్లేట్ లేకుంటే : వాహనానికి నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తే వారిపై సెక్షన్ 171 కింద ఆర్టీఏ, ట్రాఫిక్, పోలీసులు చర్యలు తీసుకుంటారు. మొదటిసారి పట్టుబడితే రూ.200, రెండోసారికి రూ.500 జరిమానా విధిస్తారు. మూడోసారి చిక్కితే వాహనాన్ని స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుంది. – ఖలీల్‌వాడి

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 69 ఫిర్యాదులు వచ్చాయి. భూ సంబంధిత రెవెన్యూ ఫిర్యాదులు, పింఛన్‌లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంబంధిత శాఖల అధికారులు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించాలన్నారు. ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను దరఖాస్తుదారునికి తెలియపర్చాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ చందర్ నాయక్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ హారిక మాట్లాడుతూ.. ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవచ్చన్నారు. ఎంపీడీవో సయ్యద్‌సాజీద్‌అలీ, ఎంపీవో సవిత, ఏపీవో కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయిలో ప్రజావాణికి హాజరైన అధికారులు

సమాచారం

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరం గాను ఇంటర్మీడియట్ అప్‌గ్రేడ్ చేసినట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కోర్సుకు 40 సీట్లు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలో పేద విద్యార్థులు, తల్లిదండ్రులు లేని విద్యార్థులు, ఆసక్తి గలవారు రాజంపేట కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు..

రాజంపేట కేజీబీవీలో ఈ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వొకేషనల్ కోర్సు బోధించడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాసులను ఆహ్వానిస్తునట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి సోమవారం తెలిపారు. ఎంఎస్సీ కంప్యూటర్ సైన్సు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టుకు అర్హులని పేర్కొన్నారు.

నేడు త్రిశక్తి అమ్మవార్లకు లక్ష పుష్పార్చన

కామారెడ్డి అర్బన్: శ్రావణ మంగళవారం సందర్భంగా ఉదయం 10.30 గంటల నుంచి రెండు గంటల పాటు స్థానిక సిరిసిల్ల రోడ్డులోని శ్రీశక్తి అమ్మవార్లకు లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ వికాస పరిషత్ అధ్యక్షుడు చేపూరి అర్జున్‌రావు తెలిపారు. లక్ష పుష్పార్చన అనంతరం హారతి, తీర్థప్రసాదాలు, అర్చన పుష్పాల వితరణ చేయనున్నట్లు పేర్కొన్నారు.

మానవత్వం చాటారు



వృద్ధురాలు శకుంతలతో మాట్లాడుతున్న సీఐ నరహరి



వృద్ధురాలికి తినిపిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియ

- 'సాక్షి' కథనానికి స్పందించిన ఏఎస్పీ చైతన్యరెడ్డి
- 'అనాథగా అమ్మ' వివరాలు సేకరించాలని సీఐకి ఆదేశం
- ఆస్పత్రికి తరలించి వైద్యమందేలా చేసిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ షెడ్డులో కొన్ని రోజులుగా వర్షంలో తడుస్తూ, చలికి వణుకుతూ ఉంటున్న వృద్ధురాలి దీన స్థితిపై 'సాక్షి' దినపత్రిక మెయిన్‌పేజీలో సోమవారం 'అనాథగా అమ్మ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో కథనాన్ని చదివి ఏఎస్పీ చైతన్యారెడ్డి చలించిపోయారు. ఆ వృద్ధురాలికి అన్ని విధాలుగా సహాయం చేసి, పూర్తి వివరాలు సేకరించాలని పట్టణ సీఐ నరహరిని ఆదేశించారు. దీంతో సీఐ నరహరి సోమవారం ఉదయం వృద్ధురాలు శకుంతల ఉన్న చోటికి వెళ్లి వివరాలను సేకరించి ఏఎస్పీకి తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ సైతం సాక్షి కథనానికి స్పందించి మానవత్వం చాటారు. వృద్ధురాలి వద్దకు వెళ్లి స్వయంగా భోజనం తినిపించారు. దుస్తులు ధరింపజేసి, దుప్పటి అందజేశారు. పోలీసులతో కలిసి ఆటోలో వృద్ధురాలిని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. వృద్ధురాలి దీనస్థితిపై కథనం రాసిన 'సాక్షి'కి ఏఎస్పీ, పట్టణ సీఐ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌తోపాటు పలువురు అభినందనలు తెలిపారు.

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి



నస్రుల్లాబాద్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందిన ఘటన దుర్కి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం .. బాన్సువాడ మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన గుడిసె రాజు(28) సోమవారం ఉదయం నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలోని మాంధారి చెరువు అలుగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. భారీ వర్షాల ధాటికి అలుగు 765డీ మీదుగా పారుతోంది. జాతీయ రహదారి పనుల్లో భాగంగా అలుగు కోసం మొరం కింద నుంచి పైపులు వేశారు. వరద ఉధృతికి మొరం కొట్టుకుపోయింది. రహదారి ఎగువ భాగాన దిగిన రాజు నీట మునిగిపోయాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో తోడుగా వచ్చిన వ్యక్తి కుటుంబీకులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్తులు గజ ఈతగాళ్లతో గాలించగా పైపులైన్‌లో మృతదేహం లభించింది. కాగా, రహదారి పనులు నెమ్మదిగా జరగడంతోనే రాజు మరణించాడని ఆరోపిస్తూ కుటుంబీకులు, గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. మృతుడికి ఓ కూతురు ఉంది.

అదుపు తప్పిన స్కూటీ...



నస్రుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి క్రాస్‌రోడ్ వద్ద స్కూటీ అదుపు తప్పి ఓ యువతి సైడ్ డ్రెయిన్‌లో పడిపోయింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సబ్‌స్టేషన్ ఎదుట ఉన్న తాత్కాలిక మట్టిదారి పూర్తిగా కొట్టుకుపోయింది. సోమవారం ఉదయం డ్రెయిన్ దాటుతుండగా యువతి స్కూటీతో సహా అందులో పడిపోయింది. రోడ్డు పనులు చేస్తున్న కూలీలు గమనించి ఆమె పైన ఉన్న వాహనాన్ని తీసి కాపాడారు.

జాతీయస్థాయి తైక్వాండోకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన క్యూరియస్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు మయాంక్ తేజ్, శీతల్ ఎంపికైనట్లు కోచ్ వినోద్ నాయక్ తెలిపారు. హైదరాబాద్‌లో ఈ నెల 17న నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలో మయాంక్ తేజ్, శీతల్ పాల్గొననున్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ డా. రమేశ్ పవార్, ప్రెసిడెంట్ అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శి వినోద్ నాయక్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు రెండు ఏటీసీలు

- ఆర్మూర్, బాన్సువాడ నియోజకవర్గాల్లో ఏర్పాటు
- రూ.45 కోట్లతో పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతులు

ఆర్మూర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ నిచ్చేందుకు రెండు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్మూర్ మండల కేంద్రంతోపాటు బాన్సువాడ పరిధిలోని వర్నిలో రూ.45 కోట్ల వ్యయంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు పరిపాలన అనుమతులతో కూడిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.దాన కిశోర్ విడుదల చేశారు. కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల విభాగంతోపాటు టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలలో 46 ఏటీసీల ఏర్పాటుకు ఉత్తర్వులు అయ్యాయి. అందులో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు రెండు కేంద్రాలు మంజూరు కావడంపై యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ప్రత్యేక చొరవతో ఈ ఏటీసీల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడంపై ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



నస్రుల్లాబాద్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన జల్ల నర్సింలు(52) కామిశెట్టిపల్లిలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పని ముగించుకొని జాతీయ రహదారి 765డీ పై సైకిల్ నడుపుతూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు తెలుపగా నర్సింలును బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే నర్సింలు మరణించినట్లు నిర్ధారించారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుంటలో పడి ఒకరు..

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామానికి చెందిన బోడాసు ఎల్లయ్య (50) ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. చెరువులోని పూలను అమ్ముకొని జీవనం సాగించే ఎల్లయ్య ఈ నెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సోమవారం ఉదయం ఫకీరాబాద్ సమీపంలోని కుంటలో ఎల్లయ్య మృతదేహం కనిపించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వర్ని: మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. డీకొండ శ్యామల ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి పరుపు కింద దాచిన రూ.10 వేలు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: కులం పేరుతో దూషించి, ఇంటిని కూల్చిన కేసులో ఆరుగురికి నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి టీ శ్రీనివాస్ ఐదేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోర్తాడ్ మండలం రామన్నపేట్ గ్రామానికి చెందిన పత్రి పోశన్న తన చిన్నమ్మ, చిన్న నాన్నలకు పిల్లలు లేకపోవడంతో వృద్ధాప్యంలో సేవలు చేశాడు. దీంతో వారు తమ తదనంతరం ఇంటిని పోశన్నకు ఇచ్చారు. ఐతే, ఆ ఇంటిపై తనకు హక్కు ఉందని విజయ అనే మహిళ పోశన్న కుటుంబసభ్యులతో గొడవపెట్టుకుంది. రావుట్ల గ్రామానికి చెందిన బాజిరెడ్డి రమాకాంత్, పిప్రి గ్రామానికి చెందిన అరిగెల జనార్దన్, కొంపల్లి మల్లేశ్, భీమ్‌గల్ గ్రామానికి చెందిన గంగాధర్, రాధ, రామన్నపేట్‌కి చెందిన విజయలు 2015 జూన్ 19న పొక్లెయిన్‌తో పోశన్న ఇంటిని కూల్చి వేసి, కులం పేరుతో దూషించారు. దీంతో పోశన్న కుటుంబసభ్యులు మోర్తాడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టుకు పంపారు. కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు రమాకాంత్, జనార్దన్, మల్లేశ్‌లకు రూ.ఐదు వేల జరిమానా, ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఎస్సీలైన గంగాధర్, విజయ, రాధలకు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధించారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బంటు వసంత్ వాదించారు.

టాస్క్‌ఫోర్స్ బాధ్యతలు సీసీఎస్‌కు!

ఖలీల్‌వాడి: నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్‌ను సీసీఎస్‌లో కలిపినట్లు పోలీస్‌వర్గాల ద్వారా తెలిసింది. జిల్లాలో పేకాట, రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా, మొరం దందాలు, మట్కా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు చేసేది. ఐతే, ఈ విభాగాన్ని సీసీఎస్ చూడనున్నట్లు తెలిసింది. సీఐ, ఎస్సై, ఎనిమిది మంది కానిస్టేబుళ్లు పనిచేసే టాస్క్‌ఫోర్స్‌కు సరైన సమాచారం రావడం లేదనే ఉద్దేశంతో తాత్కాలికంగా తీసివేసినట్లు సమాచారం. గతంలో సీపీగా కల్మేశ్వర్ ఉన్న సమయంలో సిబ్బందిపై ఆరోపణలు రావడంతో వారిపై బదిలీ వేటు వేశారు. కొన్ని నెలలపాటు టాస్క్‌ఫోర్స్ ఎలాంటి కార్యక్రమాలూ చేపట్టలేదు. సీపీగా పోతరాజు సాయిచైతన్య వచ్చిన తర్వాత టాస్క్‌ఫోర్స్‌కు సిబ్బందిని కేటాయించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ మళ్లీ ప్రారంభమైంది. కాగా, టాస్క్‌ఫోర్స్ చేసే పనులను ప్రస్తుతం సీసీఎస్ ద్వారా చేయనున్నట్లు తెలుస్తోంది.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

కామారెడ్డి క్రైం: తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు ఆందోళన బాట పట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్‌లు ప్రధాన రహదారిపై బైఠాయించి రెండు గంటల పాటు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యావాలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్‌లకే అదనంగా ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్‌తో పాటు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిలబడాల్సింది పోయి అమలుకు పూనుకుంటోందని విమర్శించారు. అంగన్‌వాడీ సేవలకు తప్పనిసరి చేసిన ఎఫ్ఆర్ఎస్(ఫేస్ క్యాప్చర్ సిస్టం) విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆధునిక సాంకేతికతతో కూడిన కంప్యూటర్‌లు, ట్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు ఇవ్వాలని కోరారు. జిల్లా అధికారులు వచ్చి తమ సమస్యలు వినాలని అంగన్‌వాడీలు పట్టుబట్టడంతో పోలీసులు వారిని సముదాయించారు. చివరకు జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల అక్కడకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. దీంతో అంగన్‌వాడీలు వెనుదిరిగారు. సీఐటీయూ జిల్లా నాయకులు అరుణ్ కుమార్, నర్సింలు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా బీకేఎస్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రైతుల సమస్యలను పరిష్కరించి వారికి అండగా భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) ఉంటుందని సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నగేష్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేటలో గల శ్రీ కోదండ రామాలయం కల్యాణ మండపంలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో రైతులందరూ సంఘటితం కావాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో సంఘంలోని ప్రతి సభ్యుడు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సంఘ్ ప్రధాన కార్యదర్శి అంబీర్ ఆనంద్‌రావు, రాష్ట్ర కోశాధికారి మాణిక్య రెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ల శంకర్‌రావు, నాగిరెడ్డిపేట మండలాధ్యక్షుడు కాంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణురావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల లేమి

- సమస్యల వలయంలో పెద్దకొడప్‌గల్ డబుల్ బెడ్ రూం కాలనీ ఇళ్లు
- సీసీ రోడ్లు, డ్రెయినేజీ లేక ఇళ్ల ముందే నిలిచిన మురుగు నీరు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఇళ్ల ముందు నిలిచిన నీరు



పెద్దకొడప్‌గల్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల ముందు ఆనవాళ్లు కోల్పోయిన రోడ్డు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లే రహదారి కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇళ్లు లేని నిరుపేదల కోసం గత ప్రభుత్వం మండల కేంద్రంలో సుమారు 1 కోటి 25 లక్షల రూపాయిలతో 25 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సరైన స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షానికి కూడా ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిలుస్తున్నాయి. మూడు సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు అధికారులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదు. ఇప్పటికీ ఎలాంటి మౌలిక వసతులు కల్పించకపోవడంతో మరింత ఇబ్బందులు పడుతూ ఆ ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు.

డ్రెయినేజీకి కనెక్షన్ ఇవ్వని వైనం..

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించినప్పటికి డ్రెయినేజీ కనెక్షన్ లేకపోవడంతో ఇబ్బందులు మరింత ఎక్కువైపోయాయి. అదేవిధంగా మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే నీరు ఇంటి ముందే నిలవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు నీటి గుంతలతో పాటు పిచ్చి మొక్కలతో నిండిన ఖాళీ స్థలం ఉండడంతో ప్రతిరోజు రాత్రి పూట ఇళ్లలోకి పాములు, విష పురుగులు వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో పూర్తి సౌకర్యాలు కల్పించి, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సర్పాలతో సావాసం



పాములు, విష పురుగులు ఇళ్లలోకి వచ్చి చేరడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం గడుపుతున్నాం. రాత్రి పూట బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి డబుల్ బెడ్ రూం ఇళ్లలో పూర్తి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాం.

– మంగళి రాజమణి, పెద్దకొడప్‌గల్ డబుల్ బెడ్ రూం కాలనీవాసి

దుర్వాసన భరించలేకున్నాం



సీసీ రోడ్లు, డ్రెయినేజీ లేకపోవడంతో ఇళ్ల ముందు మురుగు నీరు నిలవడంతో పాటు వర్షం వచ్చినప్పుడు రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయి. మురుగు నీరు ఇళ్ల చుట్టూ నిల్వ ఉండడంతో దుర్వాసన భరించలేకున్నాం. దోమలు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నాం.

– గడ్డం రాజు, డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసి